మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా
పోస్టులు చేయరాదు

నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, మే 25 ప్రభాతవార్త : నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం మరియు ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ. రాజకీయంగాను, కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్ట ప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్, వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫోటోలు పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్‌ని బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయని తెలిపారు. సామాజిక మధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపైన ప్రత్యేకంగా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు.జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ తరహా నేరాలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు నిరంతరం 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు.

ధాన్యం కొనుగోలులో
గణనీయంగా వృద్ధి

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తెలకపల్లి, మే 25 ప్రభాతవార్త: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ గణనీయమైన వృద్ధి దిశగా కొనసాగుతున్నదని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం మండలానికి చేరుకున్న వారు మండల పరిధిలోని చిన్న ముద్దునూరు గ్రామంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ గోడౌన్ వద్ద గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, తెలకపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గల వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న వసతులను, ప్రమాణాలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధిక వర్షాలను దృష్టిలో పెట్టుకుని గడిచిన వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని తరలించడానికి లారీలను అదనంగా సమకూర్చుకొని, కొనుగోలు కేంద్రాల ధాన్యం తరలించడానికి అందుబాటులో ఉంచామని చెప్పారు. జిల్లాలోని మొత్తం 222 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం సేకరిస్తున్నట్లు వారు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటూ జిల్లాలో ఈ వారంలోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. వాతావరణ పరిస్థితుల నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడే టార్పాలిన్లు అందుబాటులో ఉండాలని. రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జకీర్ ఆలీ, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రామ పాలన

అధికారి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ విజయేంద్ర బోయి

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

మహబూబ్‌నగర్, మే 25 ప్రభాతవార్త: మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో చైతన్య హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం లో ఆదివారం నిర్వహించిన గ్రామ పాలన అధికారి పరీక్ష ప్రశాం తంగా ముగిసింది. పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు.పరీక్ష కేంద్రంలో పరీక్ష జరుగుతున్న తీరు ను పరిశీలించి, హాజరు వివరాలు తెలుసుకున్నారు. గ్రామ పాలన అధికారి పరీక్షకు 152 మందికి గాను 140 మంది అభ్యర్థులు హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, ఆర్‌డిఓ నవీన్,పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మహమ్మద్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

కల్లాలలో.. వరికుప్పలు..

- ఓ వైపు వర్షాలు.. పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు,
- ధాన్యంలో మట్టి ఉందని క్వింటాల్‌కు 4 నుంచి 5 కిలోలు తరుగు తీస్తున్న రైస్ మిల్లర్లు

ఖిల్లాగణపురం. మే 25. ప్రభాతవార్త: మండలంలోని పలు గ్రామాలలో కల్లాలలో వరికుప్పలు అలాగే ఉన్నాయి.. ఓవైపు వర్షాలు పడుతుండడంతో అన్నదాతలు ఆవేదనకు గురవుతున్నారు. ప్రజా ప్రతినిధులు కానీ అధికారులు కానీ కల్లాలవైపు చూడడం లేదని పట్టించుకోవడం లేదని ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. రైస్ మిల్లులకు తరలించిన వడ్లు మ ట్టి తాలు ఉందనే సాకుతో క్వింటాలకు 4 నుంచి 8 కిలోల తరుగును తీస్తున్న కనీసం ప్రశ్నించే నాయకుడు కానీ అధికారులు కానీ లేరని రైతులు తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం తాజా మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ నాయకులు రైతులు పలు గ్రామాలలో పర్యటించి రైతులను కల్లాల వద్ద కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు గ్రామాలలో ఇంకా వరి ధాన్యాన్ని తరలించలేదని కొన్ని గ్రామాలలో తూకం చేసి లారీలు రావడంలేదని అలాగే వదిలేశారన్నారు. వరి కోతలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న ఉప్పరపల్లి మానాజీపేట సూరాయపల్లి జగ్గయ్యపల్లి వెంకటంపల్లి అనేక గ్రామాలలో ఇంకా వరి ధాన్యం తూకం వేయకుండా కల్లాలలో వరికుప్పలు అలాగే ఉన్నాయని., మరి ధాన్యం కొనుగోలుకు ప్రారంభోత్సవాల కోసం ఉత్సాహం చేసిన నాయకులు ఇప్పుడు ఎవరు ఇటువైపు చూడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఎంపీపీ కృష్ణ నాయక్ అన్నారు. గత ప్రభుత్వంలో వారం నుంచి 15 రోజుల్లో వరి తూకం వేసి లారీల్లో తరలించే వారిని వరి ధాన్యానికి సంబంధించిన డబ్బులు కూడా వారం రోజుల్లోనే రైతుల ఖాతాలలో జమ అయ్యేవని చెప్పారు. వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి కుంభకర్ణుడిలా 6 నెలలకు ఒకసారి పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి మాజీ మంత్రిని నిందించడం తప్ప ఆయన ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేయడం లేదని విమర్శించారు ఇకనైనా రైతుల వరి ధాన్యం తరలింపు పై దృష్టి సారించడంతోపాటు తరుగును తీస్తున్న రైస్ మిల్లర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వ అధికారులు కోరారు. రెండు మూడు రోజుల్లో వరి ధాన్యాన్ని తరలించకపోతే రైతులందరినీ ఏకం చేసి ధర్నా చేపడతామన్నారు. తిరుమలాయపల్లిలో కొత్తగా ఏర్పాటుచేసిన ఓ రైస్ మిల్ ఓనర్ తో పాటు అక్కడ ఉన్నటువంటి గుమస్తా మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతుల పరిధాన్యం బస్తాల నుండి మూడు నుంచి 6 కిలోల వరకు తాలుమట్టి ఉంది అనే ఉద్దేశంతో తరుగును తీశారని ఆ రైస్ మిల్ పై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పినా నాయక్, బాలిశ్వర్ రెడ్డి, మన్యం గౌడ్ ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లి గ్రామంలో తూకం చేసిన వరి ధాన్యం సంచులను పరిశీలిస్తున్న తాజా మాజీ ఎంపీపీ బృందం

వడ్లు సకాలంలో కొనక..
కల్లాల్లోనే వరి ధాన్యం

అకాల వర్షం.. తడిసిన వరి ధాన్యం

పెబ్బేరు,మే 25 ప్రభాతవార్త : పెబ్బేరు పట్టణంలోని చెలిమిళ్ల కల్లాల్లోకి మాజీ వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశానుసారం మండల అధ్యక్షులు వనం రాములు ఆధ్వర్యంలో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించడం జరిగింది. వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దైన ధాన్యం ప్రభుత్వం తమ ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోగా కవర్లు కూడా అందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు ఆరుగాలం ఎంతో కష్టపడి పండించిన ధాన్యం చేతికి అందేలోగా ప్రభుత్వ నిర్లక్ష్యంతో తడిసి ముద్దైందనీ గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సెంటర్ నిర్వాహకులను ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ముఖ్యనాయకులు పెద్దింటి వెంకటేష్,వడ్డే ఈశ్వర్,సాయి, రామకృష్ణ,వేణు,విశ్వరూపం,సోషల్ మీడియకన్వీనర్ వడ్డెరమేష్,నాగిరెడ్డి , మోహన్,మధు,మొగులయ్య,మూర్తి,వీరస్వామి,రఘు,మల్లికార్జున,కొండల్ ఓంకారీ, హర్షవర్ధన్, వేణు, మన్యం రైతులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ట్రైసిటీగా మహబూబ్‌నగర్

భవిష్యత్తులో జడ్చర్ల భూత్పూర్‌తో కలిపి ఏర్పాటు చేస్తాం

విజన్ 2047తో అభివృద్ధికి ప్రణాళికలు

టియుఐడిఎఫ్ ద్వారా మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు 220.94 కోట్లు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, మే 25 ప్రభాతవార్త: భవిష్యత్తులో భూత్పూర్, జడ్చర్ల, మహబూబ్ నగర్‌తో కలిసిన ట్రైసిటి అద్భుత మహా నగరంగా మారుతుంది అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆయన తెలిపారు. ఇప్పుడు మహబూబ్ నగర్ జనాభా మూడు లక్షలు ఉందని 2047 వరకు 5 లక్షల వరకు జనాభా పెరుగుదల ఉండవచ్చు అని, అందుకే అప్పటి అవసరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ చేపట్టుతున్నట్లు ఆయన చెప్పారు. మహబూబ్నగర్లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజన్ 2047తో మహబూబ్ నగర్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో మన మహబూబ్‌నగర్ చరిత్రలో ఓ సువర్ణ అధ్యాయం అని అన్నారు. మహబూబ్ నగర్ అభివృద్ధి కోసం పట్టుబట్టి, ముఖ్యమంత్రిని ఒప్పించి, మహబూబ్‌నగర్‌ను కార్పోరేషన్‌గా అభివృద్ధి చేసుకోవడం జరిగిందని, మహబూబ్ నగర్ అభివృద్ధికి నాకు ఆయుధం దొరికినట్లే అని ఆయన స్పష్టం చేశారు. విజన్ 2047 లక్ష్యంతో నిర్దిష్టమైన ప్రణాళికలతో మహబూబ్‌నగర్ అభివృద్ధి చేయుటకు నిపుణులతో, కన్సల్టెంట్‌లతో, సర్వేయర్‌లతో ఆలోచన చేస్తున్నామని, మహబూబ్‌నగర్‌లో ఉన్న కీలకమైన సమస్యలను గుర్తించడం జరిగిందని, నెక్స్ట్ లేవల్‌కు మహబూబ్ నగర్‌ను తీసుకుపోవడానికి అన్నివిధాలా సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. నగరంలో ఉన్న ట్రాఫిక్ ప్రధాన సమస్యగా ఉందని, నగరంలో ట్రాఫిక్ ఇబ్బడి ముబ్బడిగా పెరగడంతో సమస్యలు అధికంగా ఉన్నాయని చెప్పారు. ఈ నగరానికి అదనంగా ఇంకో బైపాస్ రోడ్డు అవసరం ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వివరించామని, వారు సానుకూలంగా స్పందించారని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మనకు బైపాస్ రోడ్డు మంజూరు అవు తుంది అని ఆయన స్పష్టం చేశారు. టియుఐడి ఎఫ్ ద్వారా మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ కార్పోరేషన్ పరిధి లోని నీటి సరఫరా అభివృద్ధి కోసం 220.94 కోట్ల రూపాయలను -మిగతా4లో..

ఉప ముఖ్యమంత్రి
పర్యటనకు ఏర్పాట్లు

ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

అచ్చంపేట, మే 25 ప్రభాతవార్త : ఆదివారం నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలంలోని గట్టు తుమ్మెన్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు కానున్న 33/11 కెవి సబ్ స్టేషన్ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలోని గట్టు తుమ్మెన్ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న శంకుస్థాపన పనులు, సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ,విద్యుత్ శాఖల అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పలు విద్యుత్ సబ్ స్టేషన్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని 132/33 కేవీ,33/11కేవీ సబ్ స్టేషన్ పనుల ప్రారంభానికి బల్మూరు మండలం గట్టు తుమ్మెన్ గ్రామంలో ప్రాంగణంలో శిలాఫలకాలను ఆవిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉదయం 9 గం.లకు హైదరాబాద్‌లోని బేగంపేట ప్రజా భవన్ నుంచి రోడ్డు మార్గాన బయల్దేరి 11 గం.లకు నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూరు మండలం గట్టు తుమ్మెన్ గ్రామానికి చేరుకుంటారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రాంగణంలో రూ.25.00 కోట్లతో పోల్కంపల్లిలో రూ.1.82 కోట్లతో బొమ్మనపల్లిలో, రూ.1. 73 కోట్లతో పదరలో నిర్మించనున్న నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్ల శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. రూ.2.24 కోట్లతో లింగాల మండలం భాకారంలో, రూ.2.54 కోట్ల అంచనాతో గట్టు తుమ్మెన్ గ్రామంలో, రూ.2.49 కోట్ల అంచనాతో ఉప్పునుంతల మండలం కంసాన్ పల్లిలో, రూ.2.74 కోట్ల అంచనా తో వంగూరు మండలం ఉల్పర గ్రామంలో, రూ.1.99 కోట్ల అంచనాతో అచ్చంపేట మండలం సింగారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 33/11 కె.వి సబ్ స్టేషన్‌ల పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఉదయం 12 గంటలకు అక్కడ - మిగతా4లో..

క్యూఆర్ కోడ్ ద్వారా పేమెంట్ చేస్తున్న ప్రయాణీకులు

పేట ఆర్‌టీసి బస్సుల్లో క్యూ ఆర్ కోడ్..!!

క్యాష్‌తో పాటు క్యాష్‌లెస్ టికెట్

కొత్త వ్యవస్థతో చిల్లర గొడవలకు స్వస్తి

ప్రయాణీకుల నుండి సానుకూల స్పందనలు

నారాయణపేట, మే 25 ప్రభాతవార్త : జిల్లాలో ఆర్టీసీ బస్సులు డిజిటల్‌గా మారుతున్నాయి. ఆర్‌టీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న బస్సుల్లో నగదు రహిత లావాదేవీల ద్వారా టికెట్లు జారీ చేసే విధంగా ఆర్టీసీ యాజమాన్యం ప్రయత్నాలు కొనసాగిస్తున్నది. దీనిపై ఇప్పటికే ఆర్టీసీ ఐటీ శాఖ ఆధ్వర్యంలో ఈ అంశంపై కసరత్తు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. దీనిపై గత ఏడాదిలోనే నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలని భావించారు. కాని కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంత ఆలస్యమైనట్లు అధికారులు చెప్పారు. బస్సుల్లో నగదు రహిత లావాదేవీల ద్వారా టికెట్ జారీ విధానాన్ని అమలు చేసే అంశాన్ని సీరియస్‌గానే తీసుకున్నట్లు చెబుతున్నారు. ప్రయోగాత్మకంగా జిల్లాలో తిరిగే సూపర్ లగ్జరీ బస్సుల్లో నగదుతో పాటు ఫోన్‌పే క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ జారీ ప్రక్రియ రెండు విధాలుగా కొనసాగుతున్నాయి. ఇదే విధానం పల్లెవెలుగు బస్సుల్లో అమలు చేయాలన్న ఆలోచనతోనే ఆర్‌టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి కొనసాగింపుగా పలు ప్రాంతాల్లో హైదరాబాద్ నుండి నారాయణపేటకు తిరుగుతున్న బస్సుల్లో అమలు చేస్తున్నారు. టిక్కెట్ల కొనుగోలును ఇబ్బంది లేకుండా చేయడానికి, ప్రభుత్వ బస్సులలో క్యూఆర్ కోడ్ సేవలను ప్రవేశపెట్టింది, దీని ద్వారా ప్రయాణీకులు టిక్కెట్ల కోసం ఆన్‌లైన్ చెల్లింపులు చేయడం సాధ్యపడుతుందనే చెప్పవచ్చు ప్రస్తుతం లగ్జరీ, ఎక్స్రెస్ బస్ సర్వీస్ ఈ వ్యవస్థను అమలు చేస్తున్నారు. అతి ముఖ్యంగా పల్లెవెలుగు బస్సుల్లలో టికెట్ కోసం చిల్లర దొరకాక ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతుంటారు. చాలా మంది ప్రయాణీకులు టికెట్ ఛార్జీకి సరైన చిల్లర తీసుకెళ్లరు మరియు ఇది కండక్టర్లకు ఇబ్బందిని - మిగతా4లో..

మల్దకల్ క్షేత్రాన్ని సందర్శించిన గోల్డ్ సిక్క చీఫ్ గవర్నెన్స్ ఆఫీసర్ ప్రతాప్

వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ప్రతాప్

మల్దకల్ మే 25 ప్రభాతవార్త : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మల్దకల్ గ్రామంలోని అపర తిరుమల గా పిలవడే శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రాన్ని హైదరాబాద్ వాస్తవ్యులు గోల్డ్ సిక్క చీఫ్ గవర్నమెంట్ ఆఫీసర్ ప్రతాప్, శాంతినగర్ వాస్తవ్యులు గ్రూప్ ప్రచార సేవా సమితి అధ్యక్షులు గాయత్రి శ్రీ నివాసులు కుటుంబ సమేతం గా సందర్శించారు. ఈసందర్భంగా ఆలయచైర్మన్ మాన్యశ్రీ ప్రహ్లాదరావు వారికి సాదర స్వాగతం పలికి అనంతరం శేషవస్త్రంతో వారిని సన్మానించి ఆలయ చరిత్రపుస్తకాన్ని అందించడం జరిగింది. అనంతరం సంకాపురం జోగులాంబ అమ్మవారి ఆలయాల దర్శనానికి బయలుదేరి వెళ్లారు.

గుడి నిర్వహణ కమిటీకి స్థలం అప్పగింత

స్థలాన్ని నిర్వహణ కమిటీకి అప్పచెబుతున్నా దృశ్యం

ఆత్మకూర్ మే 25, ప్రభాతవార్త : మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో నూతనంగా నిర్మించనున్న గ్రామదేవతల గుడి నిర్వహణ కమిటీకి ఆదివారం రోజు పట్టణానికి చెందిన తమ్మలి విజయకుమార్ తమ్మలి వెంకటేశ్వర్లు పోచమ్మ గుడి నిర్మాణం కోసం తమ సొంత స్థలాన్ని గుడుల నిర్వహణ కమిటీకి ఆదివారం అప్పగించారు. కీర్తిశేషులు తమరి అనంతయ్య కుమారులైన వెంకటేష్ మరియు విజయులు గుడి నిర్వహణ కమిటీ కోరిక మేరకు పోచమ్మతల్లి గుడినిర్మాణంకోసం తమ సొంతస్థలాన్ని అప్పగించడం పట్ల నిర్వహణ కమిటీఅధ్యక్షులు శ్రీధర్‌గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖులు రవికుమార్ యాదవ్ మనివర్ధన్ రెడ్డి దామోదర్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు. అంతేకాకుండా మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణానికి చెందిన కురుమ సంఘం ఆధ్వర్యంలో గుడుల నిర్వహణ కోసం తమ సంఘం తరఫున 2లక్షల 80 వేల రూపాయలను గుడి నిర్వహణ కమిటీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్‌కు ఆదివారం అందజేశారు ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు మల్లేష్ సుధీర్, తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు...

పాలెం ఆంజనేయులు గౌడ్ పార్థివ దేహానికి నివాళి

కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల, మే 25 ప్రభాతవార్త: బాదేపల్లి పిఏసియస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ తండ్రి పాలెం ఆంజనేయులు గౌడ్ గత కొన్ని రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డా.సి. లక్ష్మారెడ్డి కిష్టారం గ్రామానికి చేరుకొని ఆంజనేయులు గౌడ్ పార్థిక దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను మాజీమంత్రి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లక్ష్మారెడ్డితో పాటు బిఆర్ఎస్ యువ నాయకుడు చించోడు అభిమన్యు రెడ్డి పాలెం సుదర్శన్ గౌడ్‌కు తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, నాయకులు భూపతి రెడ్డి, శ్రీకాంత్, ఇమ్ము తదితరులు ఉన్నారు.

జూన్ 3న మక్తల్‌లో స్పీడ్ సైక్లింగ్ పోటీలు

మాట్లాడుతున్న బి.గోపాలం

మక్తల్, మే 25 ప్రభాతవార్త : అంతర్జాతీయ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా జూన్ 3న మక్తల్ పట్టణంలో జిల్లా స్థాయి స్పీడ్ సైక్లింగ్ పోటీలను నిర్వహిస్తు న్నామని ఆసక్తి గల క్రీడాకారులు పోటీలలో పాల్గొని విజయవం తం చేయాలని సైక్లింగ్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం పిలుపునిచ్చారు. ఆదివారం మక్తల్ పట్టణంలో ఆయన విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు, 16 ఏళ్లలోపు బాలబాలి కలకు వేరువేరుగా 10కి.మీ స్పీడ్ సైక్లింగ్ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. అలాగే సైక్లింగ్ అకాడమీలో ప్రవేశం పొందే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల క్రీడాకారులకు మక్తల్ పట్టణంలోని సాయిజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో పీఈటీలు రాఘవేందర్, రమేష్ కుమార్, క్రీడాకారులు మహేశ్వరి, గౌతమ్, వెంకటేష్, సమత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపల్లిలో భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు

బూరుగుపల్లిలో బోనాల ఉత్సవాలు

జడ్చర్ల, మే 25 ప్రభాతవార్త: జడ్చర్ల మండల పరిధిలోని బూరుగుపల్లిలో చౌడమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కురుమ, యాదవులు మేళ తాళాలతో, ఒగ్గు కథలు చెప్పుకుంటూ, గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా బోనాలతో బయలుదేరారు. శ్రీశ్రీశ్రీ చౌడమ్మ దేవాలయం దగ్గరికి చేరుకొని ఆదివారం చౌడమ్మ దేవి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 30సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం బూర్గుపల్లి గ్రామ, యాదవులు చౌడమ్మదేవికి బోనాలు సమర్పించుకుంటూ, తమ మొక్కలను చెల్లించుకుంటున్నారని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ తెలిపారు. ప్రజలలో భక్తి భావం, సజీవంగా ఉన్నత కాలం శాంతిపూరిత వాతావరణంలో ప్రజలు సుఖ జీవనం గడుపుతారని ధర్మాన్ని, పరిరక్షిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దగొల్ల మల్లేష్, బైకని రాములు,, బైకని మల్లేష్, కుర్వ శ్రీనివాస్, భరత్ కుమార్, గోరంట్ల మల్లేష్ యాదవ్, బైకని శ్రీశైలం, కొండల్, దశరథం, పరమేష్, మేడిపూరి రాజు ఎడ్ల చెన్నయ్య, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

చిన్నచింతకుంట, మే 25 ప్రభాతవార్త : విద్యుత్ షాక్ తో మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్న వడ్డెమాన్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిన్న వడ్డేమాన్ గ్రామానికి చెందిన బోయ భీమన్న(50) వ్యవసాయ రైతు ఆదివారం మ ధ్యాహ్నం భీమన్న పొయ్యిల కట్టెలు తీసుకురావడానికి జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని మన్నె వాగు పరిసర ప్రాంతాల్లోని పొలాలలోకి వెళ్లారు. అక్కడ కట్టెలు తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యు త్ తీగలు భీమన్న చెయ్యికి తగలడంతో షాక్‌కు గురై బోయ భీమన్న అక్కడక్కడ మృతి చెందాడు. అనంతరం చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి 108 లో తరలించారు. మృతుని భార్య చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్‌లాల్ నాయక్ తెలిపారు. మృతునికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

భూత్పూర్, మే 25, ప్రభాతవార్త : భూత్పూర్ మున్సిపాలిటీ నాల్గొవార్డు ఇందిరానగర్‌కాలనీకి చెందిన గడ్డం డప్పు పెంటయ్య(65) అనారోగ్యం కారణంగా ఆదివారం మృతి చెందాడు. ఇదేవార్డులో నివాసముంటున్న బీఆర్ఎస్ యూత్ వైస్ ప్రెసిడెంట్ గడ్డం ప్రేమ్‌కుమార్ మృతుని కుటుంబానికి వెళ్లి గడ్డం డప్పు పెంటయ్య పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి ఘననివాళులర్పించారు. తన వంతు సహాయంగా మృతుని కుటుంబ సభ్యులకు రు.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం రాములు, గడ్డం యాదయ్య, గడ్డం భీమస్వామి, వెంకటేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు వ్యక్తిగత దూషణలు కట్టడి చేయండి

బిఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులు బూటకపు కేసులు ఎత్తివేయాలి..!

చట్టాలపై పోలీస్ వ్యవస్థపై అపారమైన విశ్వాసం నమ్మకం ఉంది..!

జిల్లా ఎస్పీని కలసి విన్నవించిన జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్..!

జిల్లా ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

వనపర్తి క్రైమ్, మే 25 ప్రభాతవార్త: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు వ్యక్తిగత దూషణలు కట్టడి చేయాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లాఅధ్యక్షుడు గట్టుయాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్‌ను వారి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గట్టుయాదవ్‌తో పాటు అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్ నాయకులు, కార్యకర్తలతో కలసి తమ కార్యకర్తలపై జరుగుతున్న అక్రమ అరెస్టులు, బెదిరింపులు, అక్రమ కేసుల గూర్చి వివరించి చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరు పోలీస్ అధికారులు అత్యుత్సాహంతో మా కార్యకర్తలను వేధిస్తున్నారని వారి దృష్టికి తీసుకొచ్చారు. 10 ఏండ్లు అధికారంలో ఉన్నా ఏనాడు ప్రతిపక్ష నాయకులపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడలేదని అధికారంలోకి వచ్చి 18 నెలలు గడవకముందే అధికార పార్టీ నాయకులు అక్రమ అరెస్టులు, బూటకపు కేసులు పెట్టీ మా పార్టీ కార్యకర్తలను వేధిస్తున్నారని వ్యక్తిగతంగా నన్ను కూడా విమర్శిస్తూ కలుషిత వాతావరణం కల్పిస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్, పి.రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, విజయ్ కుమార్, గంధం.పరంజ్యోతి, కె.మాణిక్యం, రఘుపతి రెడ్డి, వేణు యాదవ్, బండారు కృష్ణ, నాగన్న యాదవ్, ఉంగ్లం తిరుమల్, స్టార్ రహీం, ప్రేమ్ నాథ్ రెడ్డి, మాధవ రెడ్డి, డేగ మహేశ్వర్ రెడ్డి, జోహెబ్ హుస్సేన్, సూర్యవంశం గిరి, సునీల్ వాల్మీకి, చిట్యాల రాము, పి.సురేష్, మిద్దె గొల్ల. కొండన్న, ముద్దు సార్, అలీం, జీవి ప్రశాంత్, వెంకట్ సాగర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే స్వీరోస్ లక్ష్యం

తెలంగాణ ఖ్యాతిని చరిత్రలో నిలిపిన దినమే విక్టరీ డే

బహుజన బిడ్డల భవితకు బంగారు బాటలు వేసిన ఘనత ఆర్ఎస్వీదే

కల్వకుర్తి మండలంలో ఘనంగా స్వీరోస్ విక్టరీ డే

స్వీరోస్ విక్టరీ డే నిర్వహిస్తున్న దృశ్యం

కల్వకుర్తి, మే 25 ప్రభాతవార్త : తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత స్వీరోలదని సీనియర్ స్వీరో దుబ్బ నాగేష్, నాగర్ కర్నూల్ జిల్లా స్వీరోస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండమీది కృష్ణ ,రెడ్డపాకుల శివ శంకర్‌లు పేర్కొన్నారు. ఆదివారం స్వీరోస్ నాగర్కర్నూల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కల్వకుర్తి డివిజన్లో విక్టరీ డే దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. మండలంలోని రఘుపతి పేట రామగిరి గుట్టపై స్వీరో చిన్నారులు స్వీరో జెండాతో పాటు జాతీయ పతాకాన్ని ఎగురవేసి అవకాశం ఇస్తే ఆకాశం హద్దుగా దూసుకుపోదామని, భయం వీడి చిన్న పిల్లలు గుట్టపైకి ఎక్కి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను సైతం అధిరోహిస్తామని ప్రపంచానికి సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా స్వీరో నాయకులు మాట్లాడుతూ స్వీరోస్ అంటేనే అసాధ్యాలను సుసాధ్యాలు చేయగల సత్తా ఉన్న హీరోలని వారు పేర్కొన్నారు. 2014 మే 25న మలావత్ పూర్ణ, సాధనాల ఆనంద్ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన దినమని వారు పేర్కొన్నారు. అవకాశం ఇస్తే ఆకాశమే హద్దుగా దూసుకుపోతామని ప్రపంచానికి చెప్పిన ఘనత మలావత్ పూర్ణది అనీ అన్నారు. స్వీరో ఫౌండర్ చైర్మన్ డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల కార్యదర్శిగా ఎన్నో విజయాలను సాధించారాని పేర్కొంటూ లక్షలాదిమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌దని అన్నారు. అక్షరం ఆర్థికం ఆరోగ్యం లక్ష్యంగా స్వీరోస్ ఇంటర్నేషనల్ పనిచేస్తుందని పేర్కొన్నారు. జ్ఞాన సమాజ నిర్మాణానికి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొంటూ ఆర్ఎస్పి అడుగుజాడల్లో నడిచేందుకు స్వీరోస్ ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ధైర్యంగా గుట్టపైకి ఎక్కిన స్వీరో చిన్నారులకు, ఇటీవల విడుదలైన పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఇతర పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బండమీది కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివ శంకర్, జాయింట్ సెక్రెటరీ ధర్మరాజు, మబ్బు రాము, ఆర్గనైజేషన్ సెక్రటరీ శేఖర్ మద్దెల బండ, సోషల్ మీడియా సంపత్ కుమార్, మూర్తి సాగర్, తెల్కపల్లి టౌన్ అధ్యక్షులు పరమేశ్వర్, ఉపాధ్యక్షులు బల్మూరు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..!!

ప్రజావైద్యశాల డైరెక్టర్ డా. ఎల్.మురళీధర్

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డా. మురళీధర్

వనపర్తి క్రైమ్, మే 25 ప్రభాతవార్త : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని వనపర్తి ప్రజావైద్యశాల డైరెక్టర్ డా. ఎల్.మురళీధర్ పేర్కొన్నారు. ఆదివారం గోపాల్ పేట మండల కేంద్రంలో ప్రజావైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా.మురళీధర్ మాట్లాడుతూ. ప్రజలు ఎవరి ఆరోగ్యంపై వారు శ్రద్ధ తీసుకోవాలని, మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అన్నారు. పేద ప్రజలకు వైద్యం చేరువ చేయాలనే ఆకాంక్షతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. దాదాపు రెండు వందల మందికి వైద్య పరీక్షలు చేసి మందులు టానిక్ లు అందించడమే గాక యాభై మందికి పైగా షుగర్ బీపీ టెస్టులు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన గోపాల్ పేట ఎస్సై నరేష్ కుమార్ డా.శారద, డా.సిద్దార్థ, డా.మౌనిక, డా.హర్షిత పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈనాటి కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్ఎం రాందేవ్ రెడ్డి, సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, డా.సినారె అవార్డ్ గ్రహీత ఏంఎ సత్తార్, నిఖిల్ యాదవ్, గంధం నాగరాజు, బైరోజు చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహా రెస్టారెంట్‌ను ప్రారంభించిన సీఎం సోదరులు

రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న సీఎం సోదరులు

వెల్దండ, మే 25 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై మహా రెస్టారెంట్‌ను సీఎం సోదరులు ఏనుముల తిరుపతిరెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో హోటల్ రంగం అభివృద్ధిలో కొనసాగుతుందని రుచి, శుచి, శుభ్రతతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచు యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ యాదవ్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు పార్వత్ రెడ్డి, కాంట్రాక్టర్ శశుపాల్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, జియాగూడ యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్య యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, ఎండి రషీద్, అల్లి ,పుల్లయ్య నారాయణ నాయక్, ఎర్ర శ్రీను ముదిరాజు, ముదిగొండ రమేష్, జర్నలిస్టులు పురుషోత్తం రెడ్డి, కర్ణాకర్ గౌడ్, నాగరాజు గౌడ్, బొమ్మిశెట్టి శ్రీనివాసులు, తంబాలు గంగాధారి మల్లేష్‌తోపాటు తదితరులు ఉన్నారు.

సిఎమ్ఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన మాజీ ఎమ్మెల్యే

చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

అలంపూర్, మే 25 ప్రభాతవార్త : రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు వివిధ రూపాలలో ఆర్థికంగా అందజేస్తున్న సహాయాన్ని ప్రజలు రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్షం వ్యక్తం చేస్తున్నారు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం రోజు చతిస్గడ్ రాష్ట్ర అలం పూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదివారం రోజు శాంతినగర్లో ఆయన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందజేస్తు న్నారని అలాగే పేద ప్రజలకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ మరియు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం చాలా సంతోషకరమని తెలిపారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు ఒక గొప్ప వరమని అన్నారు. ఏ రాష్ట్రంలో అమలు చేయని సన్న బియ్యం కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు అమలు చేయడం ఒక వరమని అమలు చేయడం ఒక వరం అని ప్రజలకు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని తెలిపారు. పేద ప్రజలకు సకాలంలో చెక్కులను అందజేయడం కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాకుల రాము, ఉండవెల్లి మండల అధ్యక్షులు గోపాల్, యూత్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, యూత్ నాయకులు బుచ్చన్న, శేఖర్, రాముడు, కోనేరు నరసింహ ,తదితరులు పాల్గొన్నారు.

బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అన్నదానం

దేవాలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూర్ మే 25, ప్రభాతవార్త : మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం రోజు కొత్తకోట పట్టణానికి చెందిన మండల వెంకటస్వామి పుణ్య దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం అనంతరం అన్నదానం నిర్వహించిన దంపతులకు పూజారి ప్రత్యేక తీర్థ ప్రసాదాలను అందజేశారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ మండల రామకృష్ణ వాల్మీకి సంక్షేమ సంఘం నాయకులు మండల విజయకుమార్ తదితరులతో పాటుగా పలువురు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న దృశ్యం

శ్రీరంగాపూర్, మే 25 ప్రభాతవార్త: కంచిరావు పల్లి పెబ్బేరు మధ్యలో ఉన్న మిట్ట ఆంజనేయస్వామి గుడి నిర్మాణం కొరకు శ్రీరంగాపురం మండలం షేర్ పల్లి గ్రామానికి చెందిన బి. రామన్ గౌడ్ రూ.10 వేలు విరాళముగా ఇవ్వడం జరిగింది.

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

శ్రీహరిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

వనపర్తి ప్రతినిధి, మే 25 ప్రభాతవార్త: వనపర్తి పట్టణం 13వ వార్డుకు చెందిన శ్రీహరి గత కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య ద్వారా విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి ఆదివారం వారి నివాసానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి బాధితుడిని పరామర్శించారు. మెరుగైన చికిత్స తీసుకోవాలని అందుకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే బాధితుడికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల చందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్టపాకుల మహేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, పట్టణ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంచి మనసు చాటుకున్న స్నేహితులు

ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

చిన్న చింతకుంట, మే 25 ప్రభాతవార్త : మండలంలోని కురుమూర్తి గ్రామంలో ఇటీవల గుండెపోటుతో స్నేహితుడు రాఘవేంద్ర చారి మృతి చెందడంతో భార్య, ముగ్గురు పిల్లలు పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి అండగా ఉండాలని 2000, 2001 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు ఆదివారం స్నేహితుని కుటుంబానికి రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఉన్న స్నేహితుని కుటుంబానికి ఆర్థిక భరోసా అందించిన స్నేహితుల మంచి మనసుకు పలువురు ప్రశంసించారు.

పరీక్షల్లో పిట్టల వర్ష ప్రతిభ

- పాలిసెట్, ఎస్సెస్సీ, టీజీఆర్‌జేసీలలో ర్యాంకులు

భూత్పూర్, మే 25, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఎస్సెస్సీ, పాలిసెట్, టీజీఆర్‌జేసీ పరీక్షల్లో భూత్పూర్ మండలం తాటిపర్తికి చెందిన భూత్పూర్ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఆకుల వెంకటయ్య మనుమరాలు పిట్టల వర్ష తన ప్రతిభను కనబర్చారు. వర్ష టెన్త్‌లో 600మార్కులకుగాను 536 మార్కులు, పాలిసెట్‌లో ఎంపీసీలో 78మార్కులు, బైపీసీలో 84.5మార్కులు సాధించి బైపీసీలో 3169ర్యాంకు, ఎంపిసీలో 6986వ ర్యాంకు సాధించింది. తెలంగాణ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల (టీజీఆర్‌జెసీ)లో ఇటీవల ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశపరీక్షలో 551వ ర్యాంకు సాధించి వర్ష తన అత్యుత్తమ ప్రతిభను కనబర్చింది. వివిధ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఆకుల వెంకటయ్య మనుమరాలు వర్షను పలువురు అభినందించారు. భూత్పూర్ పట్టణానికి చెందిన గొడుగు గౌతమి ఎస్సెస్సీలో 600మార్కులకు గాను 533మార్కులు సాధించి భూత్పూర్ జెడ్పీహెచ్ఎస్ టాపర్‌గా నిలిచింది.

ఆర్థిక సహాయం అందజేత

భూత్పూర్, మే 25. ప్రభాతవార్త : భూత్పూర్ మున్సిపాలిటీ పదో వార్డుకు చెందిన పులగుర్ల అక్కమ్మ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నేత టి మురళిధర్‌గౌడ్-భవాని దంపతులు ఆదివారం అక్కమ్మను పరామర్శించి ఆమె ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం తప వంతు కర్తవ్యంగా రు.10వేల ఆర్థిక సహాయం అందించారు. టీఎం గౌడ్ వెంట బీఆర్ఎస్ నాయకులు గడ్డం ప్రేమ్, పులగుర్ల మల్లేష్, గడ్డం రాములు, మాల విఠల్‌దాస్ వెంకటేష్, అబ్దుల్ వహీద్ తదితరులు ఉన్నారు.

అవోపా వేసవి శిక్షణ శిబిరం విజయవంతం

◆ 150 మంది విద్యార్థులకు నెల రోజులపాటు నిర్వహణ

విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న నిర్వాహకులు, అతిథులు

జడ్చర్ల, మే 25 ప్రభాతవార్త: జడ్చర్ల ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా రోజులుగా పదవ తరగతి విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం స్థానిక ఉదయ మెమోరియల్ పాఠశాలలో నిర్వహించారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా సీసీ కుంట మండల విద్యాధికారి, జిల్లా అవోపా అధ్యక్షుడు మురళీకృష్ణ, ఆత్మీయ అతిథిగా మాజీ సంగీత నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్, తిమ్మాజిపేట మండల విద్యాధికారి సత్యనారాయణ శెట్టి హాజరయ్యారు. జడ్చర్ల ఉపాధ్యాయుల సహకారంతో తెలుగు, ఇంగ్లీష్ మీడియం 150మంది విద్యార్థులకు ప్రతినిత్యం గణిత శాస్త్రము భౌతిక రసాయనిక శాస్త్రం, జీవ శాస్త్రము ఆంగ్లము మొదలగు విషయాలపై తరగతులు నిర్వహించామని జడ్చర్ల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎలిశెట్టి మురళీకృష్ణ, వీర బొమ్మ శివకుమార్ తెలియజేశారు. వేసవికాల సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముగింపు సమావేశంలో పాల్గొన్న అతిథులు జడ్చర్ల అవోపనిర్వహిస్తున్న సేవాకార్యక్రమం చాలా అభినందనీయమని కొనియా డారు. రాష్ట్రంలో మొట్టమొదటగా పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా వేసవిలో విద్యాబోధన శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందాన్ని నిర్వాహకులను హాజరైనటువంటి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు సబ్ ఇన్స్పెక్టర్ శ్రవణ్ సైబర్ క్రైమ్ మోసాలపై అవగాహన కల్పించారు. వేసవి శిక్షణ శిబిరంలో బోధన నిర్వ హించిన ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగాసత్కరించారు. అనంతరం నిర్వాహకులు శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆవోప అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి వీరబొమ్మ శివకుమార్, కోశాధికారి శివ తిరుపతి పాల్గొన్నారు.

నేడు డైట్ కళాశాలలో వివరాలు నమోదు చేసుకోవాలి

◆ మహబూబ్‌నగర్ డిఈఓ ప్రవీణ్ కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్, మే 25 ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఎస్‌సిఆర్‌టి ఆదేశాల మేరకు తమ సర్వీసులో ఉత్తమ బోధనా పద్ధతులు (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలుపరిచిన ఉపాధ్యాయుల నుంచి వివరాలు ఎస్సిఈఆర్టి సైట్‌లో నమోదు చేసుకోవాలని మహబూబ్‌నగర్ డీఈవో ప్రవీణ్ కుమార్ సూచించారు. ఈ విషయానికి స్పందించి నమోదు చేసుకున్న ఉపాధ్యాయులను సోమవారం మహబూబ్‌నగర్ డైట్ కళాశాలలో డైట్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో వీరి అభ్యర్థనలను పరిశీలిస్తారని తెలిపారు. నమోదు చేసుకున్న జిల్లాకు చెందిన 24 మంది ఉపాధ్యాయులను సోమవారంఉదయం 10 గం.లకు డైట్ కళాశాలకు రావలసిందిగా డీఈవో సూచించారు.

పెనిమిళ్ళలో ముగిసిన బొడ్రాయి ఉత్సవాలు

పెనిమెళ్ల కోట మైసమ్మ వద్ద నైవేద్యాలు సమర్పిస్తున్న సభ్యులు

ఉప్పునుంతల, మే 25 ప్రభాతవార్త : మండలంలోని పెనిమెళ్ళ గ్రామంలో గత మూడు రోజుల నుంచి తృతీయ బొడ్రాయి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామ దేవతలైన కోట మైసమ్మ వద్ద ముగింపు రోజైన ఆదివారం నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జక్కా చంద్రశేఖర్‌రెడ్డి, మారంసురేష్‌రెడ్డి, అంజి, అల్లె సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి వీరయ్య, గ్రామస్తులు, బొడ్రాయిఉత్సాహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురువులతో పూర్వ విద్యార్థులు

చిన్న చింతకుంట, మే 25 ప్రభాతవార్త: పదవ తరగతి వరకు కలిసిమెలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక్క చోటికి చేరి ఆనాటి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999,2000 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆనాటి తమ స్నేహితులు ఒక్కసారిగా కలుసుకోవడంతో ఆనాటి మధుర జ్ఞాపకాలను చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడ్డ గురువులైన అప్పటి పాఠశాల జిహెచ్ఎం యస్.గోపాల్ రెడ్డి ఉపాధ్యాయులు చిమ్ లాల్ జి, అజియోద్దిన్, మార్కండేయ, జగదీష్, కట్ట గిరిజా శర్మ, స్వరూప రాణి, వెంకటేశ్వర్, సోలామాన్, మనోహర్ లను పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరంవారి జ్ఞాపకాలను విద్యార్థులతోఉపాధ్యాయులు పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు చదువుకున్న రోజుల్లో కొన్నిసంఘటనలు గుర్తు చేసుకొనిసాయంత్రం వరకు సంతోషంగా గడిపారు.

ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత జ్ఞానాన్ని తెలుసుకోవాలి

- తాటికొండలో జ్ఞానవేదిక సభ్యులు ఈశ్వరయ్య

భూత్పూర్,మే 25,ప్రభాతవార్త: కులాల అంతరాలను తొలగించి జ్ఞాన సిద్ధాంతం అలవరచుకోవాల్సిన నేటి సమాజానికి ఎంతో అవసరమని త్రైత సిద్ధాంత జ్ఞాన వేదిక సభ్యులు ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం భూత్పూర్ మండలంలోని తాటికొండ గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషేదమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కర్మ యోగ విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానాన్ని తెలపాలని ముఖ్య ఉద్దేశ్యంతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మానవ శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజించాడని, జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గూర్చి తెలిపేదే త్రైత సిద్ధాంతమని తెలిపారు. భగవద్గీతలో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవధర్మాలుగా చెప్పబడతాయని, వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుంచి బయట పడేసి మనిషికి ముక్తినిస్తాయని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రచార ప్రభోధ సేవాసమితి హిందూజ్ఞాన వేదిక సభ్యులు ఈశ్వరయ్యతో పాటు శ్రీను, కృష్ణయ్య, తిరపతి, విష్ణు, వెంకటేష్, నీలిమ, కౌలస్య, సావిత్రమ్మ పాల్గొన్నారు.

బిజెపి కార్యవర్గ సమావేశం

ఉట్కూరు, మే 25 ప్రభాతవార్త: ఉట్కూరు మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఉట్కూరు మండల కార్యవర్గ సమావేశం ఉంటుందని బిజెపి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలు అందరూ మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక శ్రీ సరస్వతి శిశు మందిర్ దగ్గర ఊట్కూరు మండల కార్యవర్గ సమావేశం ఉండును. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు బూత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు.

మహిళల భద్రతయే పోలీసు మొదటి ప్రాధాన్యత

■ వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

■ బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి

జిల్లా పోలీసు కార్యాలయంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులతో సమావేశమైన జిల్లా ఎస్పీ

వనపర్తి క్రైమ్, మే25 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో బాలల పరిరక్షణ కోసం భౌతికంగా మానసికంగా సామాజికంగా భావోద్వేగంగా రక్షించడం కోసం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు, బండి అపర్ణ జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి బాలల సంరక్షణ పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీతాదయాకర్ రెడ్డి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు బండి అపర్ణ మాట్లాడుతూ.. 2005 సంవత్సరంలో బాల కార్మికుల నిషేధం నియంత్రణ చట్టం 1986 లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం 2012 బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 ఉన్నాయని ఈ సందర్భంగా తెలిపారు. పిల్లలకు ఆరోగ్యంగా సురక్షితమైన వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. పిల్లలకు విద్యా జ్ఞానం అందించడం బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పిల్లల శ్రేయస్సు సమాజం యొక్క శ్రేయస్సనీ, ముఖ్యంగా బాలలను రక్షించడంతో బాటు గౌరవించాలని, వాటిని కాపాడే అధికారాలు కమిషన్‌కు ఉంటాయని అని తెలిపారు. అంతే కాక వనపర్తి జిల్లాల్లో బాలలకు అందుతున్న విద్య గురించి సీతా దయాకర్‌రెడ్డి తోటి సభ్యురాలుబండి అపర్ణతో అడిగితెలుసుకున్నారు. అంతేకాక ఫోక్సో చట్టం అమలు తీరు, బాధితులకు అందుతున్న పరిహారం వంటి విషయాల ను ఆమె సభ్యురాలు అపర్ణతో ఏకాంతంగా రెండు గంటల పాటు జరిగిన ముఖాముఖి చర్చలో చర్చించుకున్నారు. బాలల పరిరక్షణ తెలంగాణ ప్రభుత్వం ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎక్కడ కూడా బాలలు వెట్టిచాకిరికి గురికాకుండా బాల్యవివాహాలకు, మానసిక రుగ్మతలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో బాలల పరిరక్షణ అందరు బాధ్యత అనే సంకల్పంతో ముందుకు సాగాలని ప్రతి ఒక్కరు బాలల హక్కులను కాలరాస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాటడుతూ.. బాలల విద్యార్థిని లు భద్రత సంక్షణకు సంబంధించి ఏ సమస్య ఉన్న నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, మహిళ భద్రతయే పోలీసుశాఖ మొదటి ప్రాధాన్యతని, వనపర్తి జిల్లాలో బాలల సంరక్షణకు ప్రత్యేకంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎహెచ్‌టియు, భరోసా, షీ టీమ్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తూ ఎంతో మందిని బాలలను సంరక్షించడం జరుగుతుందని ఎస్పీ అన్నారు. సమావేశంలో బాలల పరిరక్షణ కమిటీ కమిషనర్ సీతా దయాకర్ రెడ్డితో పాటు రాష్ట్ర సభ్యురాలు బండి అపర్ణ, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఉన్నారు.

చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న

గోవదశాలలను తక్షణమే మూసివేయాలి

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఎస్ఐకి వినతి

నారాయణపేట, మే25 ప్రభాతవార్త: గోరక్ష చట్టాలు అమలు చేయాలని కోరుతూ, విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ నారాయణపేట జిల్లా వారి ఆధ్వర్యంలో నారాయణపేట ఎస్ఐ అందే వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ అక్రమంలో ఉన్న గోచార భూములను విముక్తి చేయాలన్నారు. గుర్తింపు పొందిన గోశాలకు నిధులుకేటాయించాలన్నారు. ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయాలలో గోవుల ను పెంచాలని కోరారు. బక్రీద్ సందర్భంగా గోరక్షకులు ఆవులను పట్టుకొని పోలీసులకు తెలియజేసే విధంగా గోరక్షకులకు గుర్తింపు పత్రాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ప్రధాన నగరాలు పట్టణాల శివారులలో ప్రత్యేకంగా పోలీస్ చెక్పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా తరలించబడుతున్న గోసంతతిని రక్షించడమే కాకుండా రవాణా కొరకు ఉపయోగిస్తున్న ట్రక్కులను స్విచ్ చేసి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, జిల్లా సంయోజక, వడ్ల శ్రావణ్ కుమార్, విజయ్, సందీప్, గోరక్ష ప్రముఖ అనిల్, బాలు తదితరులు పాల్గొన్నారు.

సారూ..మా పాఠశాలను బాగు చేయరు!

గిరిజన తండ విద్యార్థుల ఆవేదన

శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు వ్యక్తులకు నిలయంగా మారిన దృశ్యం

చిన్న చింతకుంట, మే 25 ప్రభాతవార్త: మారుమూల గిరిజన తండాలో గిరిజన పుత్రులకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు ఎంతో దోహదపడుతున్న విద్యాలయాలు నేడు కొన్ని తండాలలో శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని ఉంద్యాల గ్రామపంచాయతీకి అనుబంధ గ్రామమైన ఉంద్యాల తండాలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రైవేటు వ్యక్తులు ఆ పాఠశాలలో పశువుల నిలయంగా, వారి నివాసంగా ఏర్పాటు చేసుకున్నారని తాండవాసులు తెలుపుతున్నారు. తండాలోని ప్రభుత్వ పాఠశాల పెచ్చులు ఊడిపోయాయని, ఈ పాఠశాలలో విద్యార్థులు చదువుకుంటే ప్రమాదాలు జరుగుతాయని కొందరు వ్యక్తులు పుకార్లు పుట్టించి ప్రైవేటు భవనంలో తాండ విద్యార్థులకు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని మరమ్మతులు చేపట్టి మా తండాకు చెందిన విద్యార్థులను ఇక్కడనే చదువుకునే విధంగాచర్యలు తీసుకోవాలని తాండా వాసులు కోరుతున్నారు. ఈ ప్రభుత్వ పాఠశాల మరమ్మతులు కు నోచుకోకపోవడంతో తండావాసులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారని, మరికొందరు ఉంద్యాల లోని ప్రాథమిక ఉన్నత పాఠశాలకు పంపిస్తున్నారని దీని ద్వారా తండాలోని ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతుందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. తండాలో ఉండే ప్రభుత్వ పాఠశాలను వెంటనే మరమ్మతులు చేపట్టి ఈ విద్యా సంవత్సరం గిరిజన విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని తాండావాసులు కోరుతున్నారు. ఇట్టి విషయాన్ని మండల విద్యాధికారి మురళీకృష్ణ దృష్టికి ప్రభాతవార్త తీసుకెళ్లగా బడిబాట కార్యక్రమంలో తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తామని, పాఠశాలలో ఉండే ప్రైవేట్ వ్యక్తులకు నోటీసులు అందిస్తామని ఆయన తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి ఉన్నత స్థాయి అధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రామపాలన అధికారుల రాత పరీక్ష

■ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

గద్వాల, మే25, ప్రభాతవార్త: గ్రామపాలన అధికారుల రాత పరీక్ష ప్రశాంత వాతావరణంలో ముగిసిందని జిల్లా అదనపు కలెక్టర్ లక్షి్మ నారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తు న్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. గ్రామ పాలన అధికారుల రాత పరీక్షకు మొత్తం 81 అభ్యర్థు ల్లో 77 మంది హాజరై, 4 మంది గైర్హాజరుకాగా, పరీక్ష 95.06 హాజరు శాతంమంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మల్లికార్జున్, పరీక్ష నిర్వా హకుడు

యాదవ చైతన్యంతోనే రాజ్యాధికారం

అఖిల భారత యాదవ మహాసభలో ఐక్యత చాటుతున్న నాయకులు

గద్వాల, మే25, ప్రభాతవార్త: యాదవ విద్యావంతుల వేదిక జోగులాంబ గద్వాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని లోపాముద్ర పీపుల్స్ స్కూల్ లో జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అనిమోని మహేందర్ యాదవ్ అధ్యక్షతన రాజకీయ చైతన్య అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బైకాని బాలు యాదవ్, అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి రవి కుమార్ యాదవ్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో భారత రాజ్యాంగం సమకాలీన రాజకీయాలు యాదవులు పాత్ర అనే అంశంపై రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, స్వాతంత్రానికి ముందు నుండి ఈ నాటి కాలం వరకు యాదవులు వెనుకబాటుకు కారణాలను తెలియపరుస్తూ చదువులేకపోవడం వల్లనే ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురిఅయ్యామని, అందుకోసం హైదరాబాద్‌లో యాదవ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయబోతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల కోసం, ఉన్నత చదువులకోసం, గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఇ.డ్యూ.ఎస్. గూర్చి తెలుపుతూ బి.సి.లకు జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటాలని, కుల గణన చేసి దామాషా పద్ధతిలో రిజర్వేషన్ లు అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల సంఘాల స్వతంత్రత ప్రాధాన్యత అనే అంశంపై డా.బైకాని బాలుయాదవ్, యాదవ సమాజంలో మూఢనమ్మకాలు బాల్యవివాహాలు అనే అంశంపై జుర్రు నారాయణ యాదవ్, భూభారతి అంశంపై వై.రవికుమార్ యాదవ్, ఆదునిక పద్ధతుల్లో గోర్రెల పెంపకం అనే అంశంపై పాలమూరు జిల్లా అధ్యక్షులు అంజన్న యాదవ్, ఉపన్యసించి యాదవుల్లో అవగాహన చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు బండల వెంకట్రాములు యాదవ్ , ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు గొల్లవెంకటేష్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కావలినర్సింహులు, మాజీ కౌన్సిలర్లు భాస్కర్ యాదవ్, నాగేందర్ యాదవ్, తుమ్మల నర్సింహులు యాదవ్, అంజన్న, మోహన్, రవిశంకర్ వెంకటేష్, రామకృష్ణ, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు గౌడ్‌కు సన్మానం

మానవపాడు, మే 25 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ అలంపూర్ నియోజకవర్గంలో ఆదివారం పర్యటించారు. పలు శుభకార్యాలకు స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. అనంతరం అలంపూర్ చౌరస్తాలోని బిఆర్ఎస్ యువనేత కిషోర్ సమక్షంలో స్థానిక నాయకులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ పరంగా జరుగుతున్న రాజకీయ పరిణామాలపై పలు అంశాలపై ఇక్కడి నాయకులను అడిగి తెలుసుకున్నారు. అందరి సమన్వయంతో కలిసి ఉంటేనే ఏదైనా సాధించుకోగలమని తెలిపారు. అనంతరం ఆయనని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రవి గౌడు, దుబ్బన్న, ఆనంద్, విజయ్ రజాక్ మేడికొండ భాష పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల

మాజీ ఎంపిటీసీ సత్యమ్మను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్,మే 25, ప్రభాతవార్త: భూత్పూర్ మండల మాజీ ఎంపి టీసీ అమిస్తాపూర్‌కు చెందిన సత్యమ్మ భర్త బాల్ నాగయ్య ఆది వారం గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెల్సుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అమిస్తా పూర్‌కు వెళ్లి బాల్ నాగయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. బాల్‌నాగయ్య అంత్యక్రియలో పాల్గొన్నారు. భర్తను కోల్పోయిన మాజీ ఎంపిటీసీ సత్యమ్మను ఓదార్చారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం గ్రామ కమిటీలే కీలకం

నూతన గ్రామ అధ్యక్షున్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

పెబ్బేరు, మే 25 ప్రభాతవార్త : పెబ్బేరు మండలం తిప్పాయిపల్లి గ్రామంలో గ్రామ కాంగ్రెస్ కమిటీ పార్టీ ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు గ్రామ అధ్యక్షుడిగా చాకలిరాముడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాలరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా సాయన్న, యూత్ అధ్యక్షులుగా నవీన్ కుమార్, గ్రామ నాయకులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీరస్వామి నాయుడు, కొండారెడ్డి మహేశ్వర్ రెడ్డి నరసింహారెడ్డి బక్కన్న చిన్న వెంకటయ్య శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి కార్యవర్గ సమావేశం

ఉట్కూరు, మే 25 ప్రభాతవార్త: ఉట్కూరు మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఉట్కూరు మండల కార్యవర్గ సమావేశం ఉంటుందని బిజెపి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలు అందరూ మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక శ్రీ సరస్వతి శిశు మందిర్ దగ్గర ఊట్కూరు మండల కార్యవర్గ సమావేశం ఉండును. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు బూత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు.

గెట్ టుగెదర్‌కు అందరూ 1992 - 93 బ్యాచ్ విద్యార్థులు రండి

దేవరకద్ర, మే 25 ప్రభాతవార్త: కౌకుంట్ల మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదివిన విద్యార్థులకు ఈనెల 27న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వైట్ హౌస్ దగ్గర ఏర్పాటుచేసిన గెట్‌టు గెదర్‌కు32సంవత్సరాలు అయిన సందర్భంగా మళ్లీఒకసారి అందరం కలుసుకోవడానికి ఈ గెట్ టు గెదర్ ఏర్పాటు చేసినట్లు పి.గణేష్ శ్రీనివాస రావు, వెంకట స్వామి, శ్రీకర్, ప్రవీణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గెట్ టుగెదర్‌కుప్రతిఒక్కరు కూడావచ్చి జయప్రదం చేయాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

మక్తల్, మే25 ప్రభాతవార్త: మక్తల్ మండలంలోని కర్ని గ్రామానికి చెందిన పి.అంజప్ప ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. అంజప్ప ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో స్థానిక ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరిని కలువగా, స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.60 వేలు విలువ గల చెక్కును ఆదివారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్ చేతుల మీదుగా అందచేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు గుంతలి రవి, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

మానవపాడు, మే 25 ప్రభాతవార్త: ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామానికి మాజీ సర్పంచ్ శేషన్ గౌడ్ కుమారుడు గంగాధర్ గౌడ్ సాత్వికల వివాహ వేడుకకు మాజీ ఎమ

ట్రైసిటీగా మహబూబ్‌నగర్

మొదటి పేజీ తరువాయి భాగం..

విడుదల మంజూరు అయ్యాయి అని ఆయన తెలిపారు. మనకు ఎలాంటి వనరులు లేవు మనకు ఉన్న ఏకైక వనరులు మానవ వనరులు మాత్రమేనని, కావున మనకు ఉన్న వనరులను మనం సరిగ్గా ఉపయోగించుకొంటే అభివృద్ధి సాధించవచ్చు అని ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ఎవరూ కలలో కూడా ఊహించని విధంగా ప్రాజెక్ట్‌లు మన మహబూబ్‌నగర్‌కు వస్తున్నాయని అందులో భాగంగా ఐఐటి కళాశాల ఒకటి అని ఆయన చెప్పారు. 269 కోట్ల అమృత్ పథకం గత ప్రభుత్వం హయాంలో మూలన పడి పోయిందని, తిరిగి దానిని కదిలించి అమృత్ పథకాన్ని తెప్పించామని ఆయన గుర్తు చేశారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ. 80 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారానికి కోయిల్ సాగర్ నుంచి నీటిని తెప్పించి, తాగునీటి కష్టాలు తీర్చడం జరిగిందని, 2047 నాటికి ప్రజలకు ఉన్న అవసరాలకు అనుగుణంగా నీటి అవసరాలు తీర్చడానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మయూరి ఎకోపార్క్ అభివృద్ధి చేస్తామని,త్వరలో పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన చేస్తామని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, సిజె బెనహర్ టంకర కృష్ణయ్య యాదవ్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేట ఆర్‌టీసి బస్సుల్లో క్యూ ఆర్ కోడ్..!!

క్యూఆర్ కోడ్ ద్వారా పేమెంట్ చేస్తున్న ప్రయాణీకులు

మొదటి పేజీ తరువాయి భాగం..

కలిగిస్తుందనే చెప్పుకోవచ్చు. ఆర్‌టిసి బస్సులో క్యూఆర్ కోడ్ కొత్త వ్యవస్థను ఆర్టీసీ సంస్థ అమలు చేయడం బస్సులలో డిజిటల్ చెల్లింపును పర్యవేక్షించడానికి ఆర్టిసి సంస్థ ఒక ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కలిగి ఉంది, ఒక ప్రయాణీకుడు బస్సు లోపల క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా టికెట్ రేటును చెల్లించినప్పుడు, కండక్టర్ మరియు మేనేజర్ ఇద్దరికీ తెలియజేయబడుతుంది. ఆ తర్వాత కండక్టర్లు ప్రయాణీకులకు పేపర్ టిక్కెట్లనుజారీ చేస్తారు. ఇది జిల్లాలో కొత్త చొరవ కాబట్టి, ప్రయాణీకుల నుండిమాకు చాలా సానుకూల స్పందనలు వస్తున్నాయి అంటున్న ఆర్‌టీసి శాఖ.ఈ పద్ధతి కొన్నిరోజులుగా నారాయణపేట జిల్లాంతగా కొన్ని బస్సులలో వాడుకలో ఉంది. భవిష్య త్తులో మరిన్నిమంది ప్రయాణికులు దీనినిఉపయోగించుకునేలా చూడాలని ప్రయాణీకులు ఆశిస్తున్నారు".

డిపో మేనేజర్ లావణ్య వివరణ: ఇది వరకు "ప్రయాణికుల నుండి సరైన మార్పు పొందడంలో మేము చాలా సమస్యలను ఎదుర్కొన్నాము. బస్సుల్లో చిల్లర నుండి వచ్చే చిన్న సమస్య తరచుగా చిన్న చిన్నగొడవలకు దారితీస్తుంది. కొత్త వ్యవస్థతో, ఈ సమస్య పరిష్కరించబడుతుంది. క్యూఆర్ కోడ్‌వ్యవస్థను ఉపయోగించి టికెట్ తీసుకోవడంద్వారా ప్రయాణికులకు కొత్త అనుభవిస్తుంది. డిజిటల్ చెల్లింపులను స్వీకరించడంలో రవాణా సంస్థ యొక్క చొరవ ఇప్పుడు డిజిటల్ ఇండియా యొక్క పెద్దదార్శనికతకు దోహదపడుతోంది. ఇతర ప్రైవేట్ రవాణా ఆపరేటర్లు కూడా ఈ పద్ధతిని ప్రజలు కూడా ఆశిస్తు కూడా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. "ఈ పరిణామం నగదు లావాదేవీల అవసరాన్ని తొలగించి ప్రయాణీకులకు బస్సు కండక్టర్లకు ఇబ్బంది లేని అనుభవాన్ని అందిస్తుందన్నారు.ప్రయాణీకులకు ఈ స్కానింగ్ విధానం ద్వారాబస్సు ప్రయాణంలో మరింత సౌకర్యవంతమైన అనుభవం లభిస్తుంది అని అన్నారు. ప్రతి రోజు నలుగురు కండక్టర్లకు చొప్పున దీనిపై ట్రైనింగ్ కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇక ముందు కూడా పల్లెవెలుగు బస్సుల్లో కూడా క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ తీసుకొనే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

ఉపముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

మొదటి పేజీ తరువాయి భాగం..

ఏర్పాటు చేసిన పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2 గం.లకు రంగారెడ్డి జిల్లాకు వెళ్తారని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు సలహాలను అందజేశారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేయాలని ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, విద్యుత్తు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఉన్నారు.

ఎస్పైకి వినతి పత్రం అందజేసిన విహెచ్‌పి నాయకులు

నారాయణపేట టౌన్, మే 25 ప్రభాతవార్త : గోరక్ష చట్టాలు అమలు చేయాలని కోరుతూ, విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ నారాయణపేట ఆధ్వర్యంలో నారాయణపేట ఎస్పై అందె వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విహెచ్ పి నాయకులు మాట్లాడుతూ అక్రమంలో ఉన్న గోచార భూములను విముక్తి చేయాలన్నారు. గుర్తింపు పొందిన గోశాలలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయాలలో గోవులను పెంచాలని కోరారు. బక్రీద్ సందర్భంగా గో రక్షకులు ఆవులను పట్టుకొని పోలీసులకు తెలియజేసే విధంగా గోరక్షకులకు గుర్తింపు పత్రాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ప్రధాన నగరాలు పట్టణాల శివారులలో ప్రత్యేకంగా పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా తరలించబడుతున్న గోసంతతిని రక్షించడమే కాకుండా రవాణా కొరకు ఉపయోగిస్తున్న ట్రక్కులను స్విచ్ చేసి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.విహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, జిల్లా సంయోజక, వడ్ల శ్రావణ్ కుమార్, విజయ్, సందీప్, గోరక్ష ప్రముఖ పాల్గొన్నారు.

ఆదివాసీలు మద్యానికి బానిస కాకూడదు

ఎస్పై వెంకటేశ్వర్లు గౌడ్

లింగాల, మే 25 ప్రభాతవార్త: ఎక్కువ శాతం ఆదివాసీలు మద్యానికి బానిస అవుతున్నారని దాని వల్ల కుటుంబ పోషించలేక ఆరోగ్య సమస్యలు ఎక్కువై కుటుంబం నాశనం అవుతుందని ఎస్పై వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. ఆదివారం లింగాల మండలంలోని అప్పాపూర్ పెంట, రాంపూర్ పెంట, బౌరపూర్ పెంట,పుల్లయ్యపల్లి పెంటల్లో పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివాసీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్పై వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ ఆదివాసీలు పెంటల్లో చాలా తక్కువ ఉన్నారని అన్ని రంగాల్లో ఎదగాలని సూచించారు. పిల్లలను బాగా చదివించి ప్రయోజకుల్ని చేయాలని కోరారు. చిన్న వయస్సులో పిల్లలకు వివాహాలు చేయకూడదని, సరైన వయస్సు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలని, ఒకవేళ చేస్తే ఆరోగ్య సమస్యలు వస్తాయని సూచించారు. ముఖ్యంగా మద్యానికి బానిస కాకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల పెంటల్లో అవగాహన కల్పిస్తున్న ఎస్పై వెంకటేశ్వర్లు గౌడ్

పిల్లలకు సంస్కారం నేర్పాల్సింది పెద్దలే

■ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, మే 25 ప్రభాతవార్త: పిల్లలకు సంస్కారం నేర్పాల్సింది ఇంట్లో ఉన్న పెద్దలే అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మై విలేజ్ మాడల్ విలేజ్ ఫౌండేషన్ సౌజన్యంతో, వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమం స్థానిక మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు కార్యాలయం ఆవరణలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులను, తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనుమరుగవుతున్న మన సంస్కృతి సాంప్రదాయాలను ఈవిధంగా విద్యార్థులకు పరిచయం చేయడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు మంచి ఏది? చెడు ఏది ? అని మనం నేర్పించకపోతే మన పిల్లలు వారి భవిష్యత్తును నష్టపోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. సెల్‌ఫోన్‌లకు మీ పిల్లలను దూరంగా ఉంచాలని, టివిలు, సినిమాల ప్రభావంతో వారిపైన చెడు ప్రభావం పడే అవకాశం ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మనం మన పిల్లలను కనిపెడుతూ ఉండాలి అని ఆయన చెప్పారు. మన పిల్లలను సరియైన మార్గంలో పెట్టడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన చెప్పారు. నిర్వాహకులు ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నో విదేశీ దండయాత్రలను తట్టుకొని మన సంస్క్ృతి సాంప్రదాయాలు చెక్కు చెదరకుండా అలాగే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే దిన పత్రికలను చదువాలని, ఉన్నత ఉద్యోగాలు సాధించిన వారందరూ కూడా దిన పత్రికలను చదివిన వారే ఉంటారని చెప్పారు. తల్లిదండ్రులు తప్పకుండా పాఠశా లో పేరెంట్స్ మీటింగ్‌కు పోవాలని, మీ పిల్లల

విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

ప్రొగ్రెస్ ను ఎప్పటికిప్పుడు తెలుసుకోవాలని ఆయన చెప్పారు. సెలవులు ఎప్పుడూ వచ్చినా పిల్లలకు సాంప్రదాయ కళలను నేర్పించాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, గుండా మనోహర్, చిత్తరంజన్ దాస్, రమేష్ గురూజీ, రఘు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల భూ పంచాయితీలో ఎస్పై జోక్యం?

■ పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకొని అమానుషంగా కొట్టినట్లు బాధితుడు ఆవేదన

■ ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

మానవపాడు, మే25 ప్రభాతవార్త: అన్నదమ్ముల భూ పంచాయతీలో ఓ ఎస్ఐ తల దూర్చారు.అయితే భూ పంచాయతీలో ఉన్న ఓ వ్యక్తిపై ఫిర్యాదు రాగా సదరు ఎస్పై పోలీస్ స్టేషన్‌కి పిలిపించుకుని ఎలాంటి విచారణ చేయకుండా అమానుషంగా కొట్టి కులం పేరుతో దూషిస్తూ బూటు కాలుతో తన్నినట్లు బాధితుడు ఆవేదన

మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు

మాట్లాడుతున్న బాధితుడు

వ్యక్తం చేశాడు.ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే తనకు న్యాయం చేయాలని బాధితుడు జిల్లా ఎస్సీ ఎస్టి, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులను ఆశ్రయించాడు బాధితుడు. కమిటీ సభ్యులు మాచర్ల ప్రకాష్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం రాజోలి మండలం చిన్న ధన్వాడ గ్రామానికి చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన మూగరాజశేఖర్ వారి కుటుంబ సభ్యుల మధ్య చిన్నపాటి భూతగాదాలు ఉన్నాయి.ఇట్టి విషయమై బాధితుడు చిన్నాన్న కొడుకు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు రాజశేఖర్‌ను ఈనెల 23న స్థానిక ఎస్పై జగదీష్ పోలీస్ స్టేషన్‌కు భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకొని రమ్మన్నాడు. పోలీస్ స్టేషన్‌కి వెళ్ళగా ఎలాంటి విచారణ చేయకుండా నోటికి వచ్చిన బూతులు తిడుతూ కులం పేరుతో దూషిస్తూ అకారణంగా బూట్ కాలుతో తన్నినట్లు బాధితుడు తెలిపాడు. సార్ షుగర్ పేషెంట్‌ని అని వేడుకున్నా కూడా ఎస్పై కనికరించలేదని బాధితుడు తెలిపాడు.

తీరు మార్చుకొని ఎస్ఐ : ఎస్పై జగదీష్ గతంలో మానవపాడు మండల కేంద్రంలో విధులు నిర్వహించాడు. అయితే అక్కడ కూడా ఎస్పై బాధితుల పట్ల ఈ రకమైన చర్యలకు పాల్పడేవారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎస్పై ఎక్కడ విధులు నిర్వహిస్తున్న మన పంతా మార్చుకోలేదని లేదనే చర్చ ప్రజల్లో జరుగుతోంది సివిల్ విషయాల్లో జోక్యం చేసుకోవడమే కాక చట్టానికి విరుద్ధంగా సదరు వ్యక్తిని కొట్టి భయభ్రాంతులకు గురిచేసిన ఎస్పై జగదీష్‌పై ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుని విధులనుంచి సస్పెండ్ చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. అయితే జరిగిన సంఘటనపై బాధితుడు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు కూడా వారు తెలిపారు.

శ్రీశైలంలో ఆర్యవైశ్య సంఘం సత్రం సేవలు అభినందనీయం

■ సీఎం సోదరులు ఏనుముల తిరుపతిరెడ్డి

నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మే 25 ప్రభాతవార్త: సీఎం సోదరులు ఎనుముల తిరుపతిరెడ్డి శనివారం కుటుంబ సమేతంగా శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మల్లికార్జున ఆర్యవైశ్య సంఘ సత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు సత్రం డైరెక్టర్ బచ్చు రామకృష్ణ,సత్రం కార్యదర్శి బాల్స శ్రీరాములు, వెల్దండ వంగూరు ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు సత్రం డైరెక్టర్లు మేడిశెట్టి సురేష్, ఉప్పు ఆంజనేయులు, తిరుపతిరెడ్డి, కుటుంబ సభ్యులకు ఆదివారంఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించి మెమెంటోను అందజేశారు. సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ

తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

తెలంగాణ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జున ఆర్యవైశ్య సంఘ సత్రం సేవలను మరింత విస్తృతపరచాలని సూచించి అభినందించారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

నారాయణపేట టౌన్, మే 25 ప్రభాతవార్త : దామరగిద్ద మండల కేంద్రంలో శంకర కంటి ఆసుపత్రి హైదరాబాద్ వైద్యుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైన్‌బో పాఠశాలలో ఆదివారంనిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది శిబిరంలో భాగంగా 88 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 41 మంది కంటి ఆపరేషన్‌ల నిమిత్తం హైదరాబాద్‌కు తర లించారు. మిగిలినవారికి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించిన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రికి వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

బిజేపి జిల్లా అధ్యక్షుడికి హర్యానా రాష్ట్ర గవర్నర్ ఫోన్

నారాయణపేట, మే 25 ప్రభాతవార్త : హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం సాయత్రం నారాయణపేట బిజేపి జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్‌కి ఫోన్ చేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులుగా నియమితులై శుభాకాంక్షలు తెలియజేశారని సత్యయాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా క్షేత్రంలో మరింత ముందుకు సాగాలని, నిరంతరం సమస్యలపై ప్రజా పోరాటం సాగించాలని సూచించినట్లు తెలియజేశారని అలాగే కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు తెలుసుకున్నారని, గవర్నర్ స్థాయిలో ఉన్నవారు నాలాంటి సాధారణ కార్యకర్త యోగ క్షేమాలు తెలుసుకొని ఆశీస్సులు అందించడం జరుగుతుందని అందుకు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ గవర్నర్ బండారు దత్తాత్రేయకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టీలో స్థానిక కమిటీల కసరత్తు షురూ..

వీపనగండ్ల ,మే 25 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీలో స్థానిక పార్టీ కమిటీల కసరత్తు రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మొదలుపెట్టారు. కొల్లాపూర్ నియోజక వర్గంలోని పానగల్ వీపనగండ్ల చిన్నంబావి మండలాలకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశానుసారం గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నూతన పార్టీ కార్యవర్గాలను ఎన్నుకోవడం కోసం అడ్డాకుల లో జితేందర్ రెడ్డి ఫామ్ హౌస్ లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నాడు ఏర్పాటు చేశారు మండలానికి ముఖ్యమైనటువంటి కార్యకర్తలను పిలిపించుకొని వారిలో కొందరి పేర్లు ఆయన అడిగి తెలుసుకున్నట్లు సమాచారం ప్రధానంగా రాబోవు స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతానికి కృషి చేసే కార్యకర్తలను పార్టీ కమిటీలలో నియమించాలని ఆలోచనతో ఆయన గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు పార్టీలో బాగా పనిచేసేటటువంటి వారు ఎవరెవరు ఉన్నారనే అంశాన్ని మూడు మండలాల కార్యకర్తలతో పేర్లు సేకరించినట్లు తెలిసింది అయితే వీపనగండ్ల మండలానికి సంబంధించి నలుగురి పేర్లను దృష్టిలోకి తీసుకున్నట్లు తెలిసింది అందులో ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం ఒక గదిలోకి తీసుకుపోయి ఎవరెవరు పార్టీ మండల అధ్యక్షుడు గా ఉండటానికి ఆసక్తి కనబరుస్తున్నారు అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు అందులో నలుగురు పేర్లు రాష్ట్ర పార్టీ నుండి వచ్చిన పరిశీలకుల ఇద్దరి ఆధ్వర్యంలో పేర్లను తీసుకున్నట్లు తెలిసింది అందులో గోపాల్దిన్నె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అయినా బాల్ రెడ్డి వీపనగండ్ల గ్రామానికి చెందిన సందు రవీందర్ రెడ్డి కలవరల గ్రామానికి చెందిన వెంకటేష్ అలియాస్ చక్రి అదే విధంగా కొర్లకుంట గ్రామానికి చెందిన గోపాల్ నాయక్ ఇతను ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తి వీరి నలుగురు పేర్లను పరిశీలనకు తీసుకోవడం జరిగింది బాల్ రెడ్డి గతంలో గోపాల్దిన్నె గ్రామసర్పంచ్ గా మరియు పానగల్ సింగిల్ విండో డైరెక్టర్‌గా అదే సొసైటీకి అధ్యక్షునిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది అంతేగాక మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అనుచరుడుగా పేరు ఉన్నది అదేవిధంగా వీపనగండ్ల గ్రామానికి చెందిన రవీందర్ రెడ్డి కృష్ణారావు ముఖ్య అనుచరుడుగా గతం నుంచి ఆయన వెంట ఉన్నాడు మిగతా ఇద్దరు కూడా మొదటి నుండి కృష్ణారావు అభిమానవరంగా ఆయనకు చేదోడు వాదోడుగా అండగా నిలబడుతూ ఆయన గెలుపు ఓటములలో భాగంగా పనిచేయడం జరుగుతుంది.ఈ నలుగురి ఆశావాహుల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది మంత్రి చేతుల్లోనే ఉన్నదని ఆశావాహులు వ్యక్తం చేస్తున్నారు అదే విధంగా పానగల్ మండలానికి చెందిన మధుసూదన్ రెడ్డి గతం నుండి పనిచేస్తుండగా ప్రస్తుతం ఆయననే తిరిగి ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది చిన్నంబావి మండలానికి చెందిన చంద్రశేఖర్ యాదవును తిరిగి మళ్లీ ఎన్నిక చేసే అవకాశంఉన్నట్లు తెలుస్తుంది గతంలో వీపనగండ్ల మండలానికి పనిచేసిన వ్యక్తి గోదల బీరయ్య యాదవ్ ను మాత్రం తప్పించికొత్తవారికి ఇవ్వాలని ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది ఆయనకు ఇంకో పదవి మెరుగైనటువంటిది ఇవ్వడానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత జ్ఞానాన్ని తెలుసుకోవాలి

భూత్పూర్,మే 25,ప్రభాతవార్త: కులాల అంతరాలను తొలగించి జ్ఞాన సిద్ధాంతం అలవరచు కోవాల్సిన నేటి సమాజానికి ఎంతో అవసరమని త్రైత సిద్ధాంత జ్ఞాన వేదిక సభ్యులు ఈశ్వరయ్య పేర్కొన్నారు.ఆదివారం భూత్పూర్ మండలంలోని తాటికొండ గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని,మతాలు నిషేదమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.కర్మ యోగ విశిష్టత,త్రైత సిద్ధాంత జ్ఞానాన్ని తెలపాలని ముఖ్య ఉద్దేశ్యంతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.మానవ శరీరంలో దేవుడు మూడు ఆత్మ లుగా విభజించాడని,జీవాత్మ,ఆత్మ,పరమాత్మల గూర్చి తెలిపేదే త్రైత సిద్ధాంతమని తెలిపారు.ఈ ప్రచార కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రచార ప్రభోధ సేవాసమితి హిందూజ్ఞాన వేదిక సభ్యులు ఈశ్వర య్యతో పాటు శ్రీను,కృష్ణయ్య,తిరపతి,విష్ణు,వెంకటేష్,నీలిమ,కౌలస్య,సావిత్రమ్మ పాల్గొన్నారు.

ఎంపి డీకే అరుణకు సన్మానం

ఎంపీ డీకే అరుణకు సన్మానం చేస్తున్న గద్వాల బీజేపీ నాయకులు

గద్వాల, మే25,ప్రభాతవార్త: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటివ్ కమిటీ తెలంగాణ ఛైర్ పర్సన్ గా నియమితులైన ఎంపీ, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీ.కే.అరుణకి గద్వాల బీజేపీ ఘనంగా సన్మానం చేశారు. శాలువాతో సత్కరించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.సన్మానం చేసిన వారిలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్ రాములు, మాజీ కౌన్సిలర్ త్యాగరాజు,ఆర్ఆర్ శ్రీనివాస్, ఎస్‌విఎం నారాయణగౌడ్ లు డీకే అరుణకు ఘనంగా సన్మానం చేశారు.

నేడు సర్వేయర్లకు శిక్షణ

మహబూబ్‌నగర్, మే 25 ప్రభాతవార్త: భూ భారతి చట్టం అమలులో భాగంగా నియమించనున్న లైసెన్స్‌డ్ సర్వేయర్‌లకు సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జడ్పీ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ప్రారంభిస్తారని సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి కిషన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఇప్పటికే లైసెన్స్ డ్ సర్వేయర్‌లు ఉదయం 9.30 గం.లకు హాజరు కావాలని ఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

నారాయణపేట టౌన్, మే25 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మునుముందు మంచి భవిష్యత్తు ఉంటుందని భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్ రెడ్డి అన్నారు. దామరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలుగా నిలిచిన జట్లకు ఆదివారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కే.రాజ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ యువత గ్రామస్థాయి క్రీడలకు పరిమితం కాకుండా జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి గ్రామానికి మండలానికి మంచి గుర్తింపును తేవాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలను రాణించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ముందు ముందు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భీష్మ ఫౌండేషన్ సభ్యులతో బాటు గ్రామస్తులు యువకులు తదితరులు ఉన్నారు.

ప్రధాని మన్‌కీ బాత్ వీక్షించిన బిజెపి నాయకులు

నారాయణపేట టౌన్, మే 25 ప్రభాతవార్త: నారాయణపేట పట్టణంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలతో ముఖాముఖిగా నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నారాయణపేట మండలం కొటకొండలోని తన నివాసంలో వికారాబాద్ జిల్లా ఇంఛార్జి నారాయణపేట జిల్లా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు స్థానిక బిజెపి నాయకులతో కలిసి టివిలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై ప్రతి నెలకొక సారి ప్రజలతో నేరుగా మాట్లాడి ప్రజల సమస్యలు సూచనలు స్వీకరించే ఏకైక ప్రధాని నరేంద్రమోడీ ఒక్కరే అని అన్నారు. ఇలాంటి ప్రధాని ఉండడం గర్వకారణమని అన్నారు.